క్లుప్తంగా

60 మందికి కంటి పరీక్షలు

ఆనందపురం : మండలంలోని భీమన్నదొరపాలెంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 60 మందికి పరీక్షలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో విశాఖ కంటి ఆస్పత్రి వైద్యుల సహకారంతో శిబిరం ఏర్పాటు చేశారు. ఆరుగురికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడానికి నిర్ణయించారు. నాయకులు బంటు చిన్న, అక్కిరెడ్డి దేముడుబాబు, సత్యసాయి సేవా సంస్థల జోన్ – 4 కన్వీనర్ సాయి పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు



వార్షికోత్సవానికి సిద్ధమైన ఆలయం

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలోని శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయం మొదటి వార్షికోత్సవం బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో అర్చకులు ఏడిద వివేకానందశర్మ, కార్తీక్, గ్రామస్తులు స్వామి వారి కల్యాణరాట వేశారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ఉమా, కాశీ విశ్వేశ్వర స్వాములకు కల్యాణం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం 4 గంటలకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, అనంతరం పుష్పాంజలి నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

నరసింహం మృతికి సంతాపం



భీమిలి: భీమిలికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు గాదు నరసింహం వృద్ధాప్య సమస్యలతో మంగళవారం మృతి చెందారు. ఈయన భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగం చేస్తూ 30 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ చెందారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తూ భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ మహోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ పండగ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాలమ్మకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రతిమ, ప్రసాదం అందజేశారు. పండగ సందర్భంగా మిథిలాపురి వుడా కాలనీ నుంచి మధురవాడ వరకు హైవే సర్వీసు రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులతో పరిసరాలు వెలిగిపోయాయి. చంద్రంపాలెం పరిసర ప్రాంతాల భక్తులు సంబరాలు, బాణసంచాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని పసుపు కుంకమ సమర్పించారు.

హత్యా స్థలిని పరిశీలించిన సీపీ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు ఆదర్శనగర్ – సంతపేటలో ఆదివారం రాత్రి హత్య జరిగిన సంఘటనా స్థలాన్ని నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ మంగళవారం సందర్శించారు. గుర్తు తెలియని మహిళ పొట్ట పైభాగాన్ని చీరి అగంతకులు హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి, ఎస్ఐ గంటా హరీష్ ఉన్నారు.

చదువుతోనే సమాజంలో మార్పు



చంద్రంపాలెం హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



జగనన్న విద్యా కానుక కిట్లతో రెడ్డిపల్లి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- చంద్రంపాలెం హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

మధురవాడ: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గత నాలుగేళ్లలో విద్యా రంగానికి రూ. 50 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని చెప్పారు. దేశంలో మొట్టమొదటి సారిగా ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టింది సీఎం జగన్ అని కొనియాడారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3,900 మంది విద్యార్థులకు సుమారు రూ.62 లక్షల విలువ చేసే జగనన్న విద్యా కానుక కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధితోనే సమాజంలో మార్పులు వస్తాయని, ఇందుకు జపాన్ దేశమే నిదర్శనమని చెప్పారు.

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేని స్థితి నుంచి కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేశామన్నారు. చంద్రంపాలెం పాఠశాలలో వసతుల కల్పనకు ఇప్పటికే రూ.2.41 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, ప్రధానోపాధ్యాయుడు ఎమ్.రాజబాబు, పాఠశాల కమిటీ సభ్యులు పిళ్లా సూరిబాబు, రాజు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతురావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పీకేఎమ్ పాత్రుడు, వాండ్రాసి రవికుమార్, వరలక్ష్మి, గుంటబోయిన సంజీవ్, పిళ్లా రమణ తదితరులు పాల్గొన్నారు.



జగనన్న విద్యాకానుక కిట్ అందజేస్తున్న కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు

విద్య, వైద్యానికి పెద్ద పీట

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తూ పేదలకు అండగా నిలుస్తోందని కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ ప్రాథమిక పాఠశాలలో, మంగమారిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు మంగళవారం అందజేశారు. పేద విద్యార్థులంతా చదువుకుని ఉన్నత స్థానంలో ఉండాలనేది ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉద్దేశమని పేర్కొన్నారు.

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డు పరిధి లక్ష్మీవానిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. 1 నుంచి 8వ తరగతి వరకూ విద్యను అభ్యసిస్తున్న 350 మందికి వస్తువులు అందించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే అవసరమైన అన్ని వస్తువులతో కిట్లు అందజేయడం సంతోషకరమని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

పద్మనాభం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేకుండా విద్యార్థులకు అవసరమైన వస్తువులన్నీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉచితంగా అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, ఎంఈవో ఎం.శివరాణి, వైఎస్సార్ సీపీ నాయకుడు ఈర్ల ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు గొప్ప సాయం



సీఎంవె వైఎస్ జగన్ మోహన రెడ్డి ఒక్కొక్కరికి ఎంతో విలువైన స్కూల్ బ్యాగు, బూట్లు, యూనిఫారాలు, పాఠ్య, నోటు పుస్తకాలు ఇవ్వడం పేద పిల్లలకు చేసే గొప్ప సాయం. అది కూడా స్కూళ్ల ప్రారంభమైన వెంటనే ఇవ్వడం మరింత గొప్ప విషయం. గతంలో నెలలు దాటిన తర్వాత పుస్తకాలు వచ్చేవి. ప్రభుత్వ సాయం మా లాంటి పేదవారికి మరింత తోడ్పాటునిస్తుంది. సీఎం జగన్ సార్‌కు ధన్యవాదాలు.

– డి.పావని, 10వ తరగతి, చంద్రంపాలెం

ఆనందంగా ఉంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మా లాంటి వారికి ఇంత మంచి కిట్స్ ఇచ్చి ఉండకపోతే చదువు కోవడం కష్టమనే చెప్పాలి. నాన్న ప్రైవేటు జాబ్ చేస్తున్నారు. మేము ఇద్దరం ఆడపిల్లలం. మాకు పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు కొనేందుకు నాన్న ఎంతో కష్టపడాల్సి వచ్చేది. మాకు అమ్మ ఒడి, జగనన్న ఇల్లు, రుణ మాఫీ, నాన్నకు రైతు భరోసా వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది.

– కె.మాధురి, 10వ తరగతి, చంద్రంపాలెం

చాలా గొప్ప పథకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిల్లల చదువు కోసం చాలా గొప్ప పథకాలు ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లను ప్రైవేటు కంటే మెరుగ్గా తీర్చిదిద్దారు. పిల్లలకు చాలా నాణ్యమైన కిట్స్ ఇచ్చారు. గతంలో నోటు పుస్తకాల కోసం క్యూ కట్టాల్సి వచ్చేది. ప్రతీ వస్తువు కొనడానికి విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా ఇబ్బంది పడాల్సి వచ్చేది. స్కూలు ప్రారంభం రోజే కిట్లు అందించడం గొప్ప విషయం.

– జి.ప్రకాష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు, బహుజన టీచర్స్ అసోసియేషన్

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



జగనన్న విద్యా కానుకల్లో భాగంగా విద్యార్థులకు సమకూర్చిన యూనిఫారం చాలా బాగుంది. కార్పొరేట్ పాఠశాలల యూనిఫారంను తలదన్నే విధంగా ఉంది. విద్యార్థులకు ఏం అవసరమో సీఎం జగన్ సార్‌కు తెలుసు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆయన అందిస్తున్న సాయానికి రుణపడి ఉంటాం.

– ఎస్.ప్రవళిక, 7వ తరగతి, రెడ్డిపల్లి హైస్కూల్

గతానికి భిన్నంగా సౌకర్యాలు



గతానికి భిన్నంగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి విద్యార్థులందరం రుణపడి ఉంటాం. అందమైన దుస్తులు, ఖరీదైన నోట్ పుస్తకాలు, నాణ్యమైన, రుచికరమైన ఆహారం, అమ్మఒడి ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి మా ధన్యవాదాలు.

– ఎస్.సాయి సునీత, 8వ తరగతి, రెడ్డిపల్లి హైస్కూల్

తాగునీటి సరఫరా వేళల్లో మార్పు

తగరపువలస: స్థానిక వేంకటేశ్వరమెట్ట వద్ద గల 1800 కేఎల్ రిజర్వాయర్‌కు మరమ్మతులు కారణంగా పంపింగ్ మంగళవారం నిలిపివేశారు. దీంతో తగరపువలస, భీమిలి ప్రాంతాలకు తాగునీటి సరఫరా వేళలు మార్చారు. ప్రస్తుతం తగరపువలసలో ఉదయం 5.30 గంటల నుంచి 10.30 వరకు సరఫరా చేస్తుండగా ఇక నుంచి ఉదయం 8 గంటలకు, తిరిగి సాయంత్రం 8 గంటలకు సరఫరా చేస్తారు. భీమిలిలో ప్రస్తుతం ఉదయం 5 నుంచి 7.30 వరకు సరఫరా చేయగా ఇకపై ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా చేస్తారు. చిట్టివలస గ్రామాలకు సరఫరా చేసే సమయంలో మార్పులు లేవని జెడ్సీ బి.రాము తెలిపారు.

కొత్తమ్మ తల్లికి బంతిపూలతో అలంకరణ



బంతిపూల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డుల గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం బంతి పూల మాలలతో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో అలంకరణకు కొండపేటకు చెందిన ఎలిగారపు సతీష్‌కుమార్ ఆర్థిక సాయం చేశారు. భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మ తల్లి ఆలయం, భవానీ పీఠాలకు చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి అలంకరణ చేశారు.

26 మంది ఉపాధ్యాయుల బదిలీ

పద్మనాభం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న 26 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. మండలంలో ఒక పాఠశాల నుంచి వేరొక పాఠశాలకు 16 మంది, ఇతర మండలాలకు పది మంది బదిలీ అయ్యారు. ఇతర మండలాల నుంచి పద్మనాభం మండలానికి 24 మంది ఉపాధ్యాయులు బదిలీపై వచ్చారు.

నీటి నిల్వలతో దోమల వ్యాప్తి



ఫైలేరియా రోగులకు కిట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఆనందపురం : నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని డాక్టర్ పద్మ అన్నారు. ఫైలేరియా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని శొంఠ్యాంలో మంగళవారం 23 మంది వ్యాధిగ్రస్తులకు టబ్బు, మగ్గు, సబ్బు, తువ్వాలు, అయింట్మెంట్‌తో కూడిన కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాటిని ఎలా వినియోగించాలో వివరించారు. బోదకాలు వాపు ఉన్న వారు రోజూ సబ్బునీటితో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉంటే దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా ప్రబలుతాయని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.పరమేశ్వరరావు, పర్యవేక్షకులు కల్యాణమ్మ, సన్యాసిరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులకు సత్కారం



గ్రామ పెద్దలను సత్కరిస్తున్న లక్ష్మీవానిపాలెం గ్రామస్తులు

మధురవాడ: ఇటీవల పీఎంపాలెం పరిసర గ్రామాల ఆరాధ్య దేవత బబ్బేలమ్మ అమ్మవారి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన గ్రామ పెద్దలు పోతిన శ్రీనివాసరావు, పోతిన బాలాజీ, పోతిన ప్రసాద్ తదితరులను ఘనంగా సత్కరించారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో లక్ష్మీవానిపాలెం గ్రామస్తులు పోతిన చంటి, వాండ్రాసి సన్యాసిరావు, పోతిన రాము, పోతిన ఎల్లాజీ తదితరులు ఘనంగా సన్మానించారు. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉదయం 6 గంటలకే విధులకు హాజరవకుంటే చర్యలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని అన్ని సచివాలయాల్లో విధులు నిర్వర్తించే శానిటేషన్ కార్యదర్శులు ఉదయం 6 గంటలకే విధులకు హాజరుకావాలని భీమిలి జెడ్సీ బి.రాము ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల పలు సచివాలయాల పరిధిలో శానిటేషన్ కార్యదర్శులు ఉదయం 6 గంటలకు విధులకు హాజరు కాకపోవడం ఆయన దృష్టికి వచ్చింది. దీనిపై ఆయన స్పందిస్తూ సమయానికి విధులకు హాజరుకాని కార్యదర్శులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన హిందీ శిక్షణ తరగతులు



సర్టిఫికెట్లు పొందిన వారితో నిర్వాహకులు

తగరపువలస: భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో మే 1 నుంచి నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఫిబ్రవరిలో దక్షిణ భారత హిందీ ప్రచారసభ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా సూకరాజు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందీ భాష నేర్చుకోవాలని సూచించారు.

హిందీ భాష నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు పెరగడంతోపాటు ఏ రాష్ట్రానికి వెళ్లినా ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉచితంగా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు.

బోరు బావి నిర్మాణానికి శంకుస్థాపన




పొట్నూరులో శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని పొట్నూరులో గల ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మండల పరిషత్ నిధులు రూ.1.2 లక్షలతో బోరు బావి నిర్మాణానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 ఎంపీటీసీ సెగ్మెంట్‌లకు 15 బోరు బావుల నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.18 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. వీటిలో ఇప్పటికే ఎనిమిది ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మిగతా ఏడు బోరు బావులు నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తోనంగి దివ్య, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అవనాపు శాంతి, వైఎస్సార్ సీపీ నాయకులు బేపల గురునాయుడు, తోనంగి అప్పలనాయుడు, అవనాపు బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాట్లు



తగరపువలసలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు శస్త్ర చికిత్సలు చేయిస్తోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2022 అక్టోబర్ 21న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పథకాన్ని ప్రారంభించారు. అప్పటి వరకు రోగులే వ్యయప్రయాసలకు ఓర్చి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుండేవారు. ఈ పథకం ప్రారంభించిన తర్వాత పీహెచ్‌సీ వైద్యులే నెలలో రెండు రోజుల పాటు ఒక్కో గ్రామాన్ని సందర్శించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్లను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అవసరమైతే ప్రత్యేక వైద్యుల సలహాలు అందించడమో.. లేదా అక్కడకు పంపించడమో చేస్తున్నారు. ఇటీవల ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మండల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరువ చేశారు. భీమిలి నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలలో మొదటి వారంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త ఆధ్వర్యంలో మానసిక వైద్య నిపుణులు చికిత్స అందిస్తున్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వారం రోజుల పాటు ఉదయం, మధ్యాహ్నం రోజుకొకరు చొప్పున ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులో ఉంచుతున్నారు. ఆయా రోజుల్లో వారి సేవలను వినియోగించుకోవాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

వారం	తగరపువలస యూపీహెచ్‌సీ	భీమిలి యూపీహెచ్‌సీ	చేపలుప్పాడ యూపీహెచ్‌సీ
సోమవారం	పీడియాట్రిక్స్, పల్మనాలజీ	పీడియాట్రిక్స్, డెర్మటాలజీ	జనరల్ మెడిసిన్
మంగళవారం	ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్	ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్	డెర్మటాలజీ, పీడియాట్రిక్స్
బుధవారం	ఈఎన్‌టీ, డెర్మటాలజీ	ఈఎన్‌టీ, పల్మనాలజీ	---
గురువారం	గైనిక్ అండ్ ప్రసూతి	గైనకాలజీ	గైనకాలజీ
శుక్రవారం	-	---	ఆర్థోపెడిక్
శనివారం	జనరల్, జీరియాట్రిక్స్	జీరియాట్రిక్స్	జీరియాట్రిక్స్, ఈఎన్‌టీ

భీమిలి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి అభివృద్ధి విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. మంగళవారం భీమిలి జమ్మి చెరువు పార్కులో రూ.85 లక్షలతో వాకింగ్ ట్రాక్, ప్రహరీ నిర్మాణం, క్రీడా పరికరాల ఏర్పాటు, పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న కాలంలో భీమిలిలో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముందుగా భీమిలిలో గల ఇండోర్ స్టేడియంలో రూ. 25 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహా కామేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం నేడు



మధురవాడ: ఐటీ సెజ్ కూడలిలోని లలిత త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వర స్వామి ఆలయ 4వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ఆలయాన్ని, స్వాముల విగ్రహాలను సుందరంగా అలంకరించారు. ఉదయం 7 గంటలకు విఘ్నేశ్వర పూజ, కలశ స్థాపనతో వేడుకలు ప్రారంభమవుతాయి. అనంతరం స్వామికి పంచామృత, సుగంధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద పంపిణీ, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, ఉత్సవమూర్తుల తిరువీధి మహోత్సవం, నక్షత్ర హారతి ఉంటుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కాలనీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, ఆలయ కమిటీ ప్రతినిధులు అప్పారావు, ప్రతాపరాజు, జేడీ నాయుడు కోరారు. వివరాల కోసం ఆలయ మేనేజర్ కొల్లి సింహాచలం నాయుడు, అర్చకులు అంపోలు వెంకటరమణమూర్తిని 99634 69043లో సంప్రదించాలని కోరారు.